వెంకన్నకు జాతర శోభ

- రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- రేపే జాతర
- 8 శతాబ్దాల చరిత్ర గల అద్భుత ఆలయం
- లక్షమంది యాత్రికులు పాల్గొనే అవకాశం



శ్రీశాల వెంకన్న క్షేత్రంలో బ్రహ్మోత్సవ శోభ



జాతరకు ముస్తాబైన అతిపెద్ద రథం

సిరిసిల్లటౌన్: కాకతీయ పూర్వ చారిత్రక నేపథ్యం గల ఎనిమిది శతాబ్దాల చరిత గల శ్రీశాల వెంకన్న ఆలయం జాతర శోభను సంతరించుకుంది. కలియుగ వైకుంఠంగా భావించే తిరుమల శ్రీవారి దివ్యక్షేత్రం తరువాత తెలంగాణ రాష్ట్రంలో ఆ స్థాయి క్షేత్రంగా విలసిల్లుతోంది సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం. ఉత్తర తెలంగాణాలోనే 25 అడుగుల ఎత్తైన రథం కలిగి ఉన్న మహావిష్ణువు ఆలయంగా ప్రాశస్త్యం కలిగి ఉంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లక్ష మందికి పైగా పాల్గొనే ఈ వెంకన్న స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ..

శ్రీశాల క్షేత్రంలో శ్రీ మహావిష్ణువు స్వయంభూగా వెలిశారని ప్రతీతి. పూర్వం మానేరు నదీ తీరంలో మాండవ్య మహాముని ఆశ్రమం ఉండేది. ఒకరోజు ఆయన రుషి పుంగవులు, తపసుల సూచన మేరకు శ్రీమహావిష్ణు యాగం చేయాలని తలపించి కఠోర తపస్సును ఆచరిస్తాడు. ముని భక్తి ప్రపత్తులకు మెచ్చి ప్రసన్నుడైన స్వామి, ఇక్కడ ప్రవహించే నది కూడా ముని పేరు మీద ప్రాచుర్యంలోకి వస్తుందని, తీరం వెంబడి గ్రామ నిర్మాణంతో పాటు, ఆలయ నిర్మాణం కూడా జరుగుతుందని అభయమిస్తాడు. కాలక్రమేనా జమీందారులు, దేశాయిలు ఈ ప్రాంతంలో గ్రామ నిర్మాణానికి పూనుకుంటారు. ఒకరోజు వారికి కలలో స్వామివారు కనిపించి నూతన గ్రామానికి శ్రీశాలగా నామకరణం చేయాలని ఆదేశించాడు. స్వామి ఆదేశానుసారం గ్రామంతో పాటు కేశవనాథ స్వామి ఆలయం నిర్మాణమయ్యాయి.

దేశాయిల హయాంలో..

1826 ప్రాంతంలో మొఘలులు, కాకతీయుల రాజ్యంపై దండయాత్ర జరిపి ధ్వంసం చేసిన ఆలయాల్లో కేశవనాథ స్వామి ఆలయం కూడా ఉంది. ఈ దాడిలో ఛిద్రమైన విగ్రహం ఇప్పటికీ ఆలయంలో ఉంది. కొన్నాళ్లకు దేశాయ్ వంశీయుడు చెన్నమనేని తుక్కారావు, మీనారావుకు స్వామి దర్శనమిచ్చి మాండవ్య నదీ తీరంలోనే యాగం జరిపినప్పటి తన విగ్రహం వజ్రదంతి (బర్రెంక) వృక్షం కింద ఉండిపోయిందని, ఆ చెట్టును ఖననం చేసి, విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించాలని చెప్పి అంతర్ధానమవుతాడు. మరుసటి రోజు బర్రెంక వృక్షాన్ని పెకిలించి చూడగా అచ్చం స్వామి విగ్రహాన్ని పోలిన విగ్రహం కనిపిస్తుంది. మహదానందంతో ఆ ప్రతిమను తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయ ప్రాభవం పెరుగుతూ వస్తోంది.

జాతర ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం(జాతర) ప్రత్యేకత సంతరించుకుంటుంది.

➡ దాదాపు లక్షకు పైగా పాల్గొనే ఈ జాతరకు దేవాదాయ, మున్సిపల్, పోలీస్ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

➡ ఆలయ ప్రాంగణంలో రథంపై స్వామివారికి భక్తులు దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు, పెద్దవాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

➡ అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

➡ ఆలయం చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

➡ క్యూలైన్లో నిల్చునే భక్తులకు మంచినీటి సరఫరా ఆలయ ప్రాంతంలో వైద్య, ఆరోగ్యశాఖ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

➡ శ్రీవారికి రథంపై దర్శించే భక్తులకు స్పెషల్, సాధారణం, వీఐపీ దర్శనాలకై క్యూలైన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

➡ జాతరలో అంటు వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ వారు శానిటేషన్ పనులను నిర్వహిస్తున్నారు.

➡ రథం తిరిగే మాడవీధుల్లో రోడ్లపై ఇసుకను పోయించారు.

➡ జాతర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సకల సౌకర్యాలు సమకూర్చారు.

మధ్యాహ్నమే రథోత్సవం



ఈ ఏడాది రథోత్సవం రోజున రాత్రి చంద్రగ్రహణం ఉండటంతో శ్రీవారి దర్శన వేళల్లో అధికారులు మార్పులు చేశాం. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే శ్రీవారిని రథంపై భక్తులు దర్శించుకోవచ్చు మాడవీధుల్లో రథోత్సవం తర్వాత సాయంత్రం 5 గంటలకే ఆలయాన్ని మూసేయడం జరుగుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలి. భక్తుల మొక్కులు చెల్లింపుకై రథంపై, ఆలయంలో ప్రత్యేకంగా హుండీలు ఏర్పాటు చేశాం.

– మారుతిరావు, ఆలయ ఈవో

క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న పండితులు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలికొండ రమణాచార్య గురుస్వామి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. గణపతిపూజ, పుణ్యాహవాచనం, విగ్రహానికి జల, ఫల, పుష్ప, శయ్యాది వాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో నమిలికొండ రామకృష్ణమాచార్యులు, విష్ణుమాచారి, రాకేశ్‌స్వామి, బొడ్డు దేవదాసు, సుదోగోని శ్రీనివాస్, గణేశ్, నోముల రామకృష్ణ, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

మేరా మిట్టి.. మేరా దేశ్



మట్టి సేకరిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్డీవో అడిషన్ పీడీ నర్సింహులు ఆధ్వర్యంలో మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 30 గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కుండలో సేకరించారు. ఆ మట్టి కుండను కలెక్టరేట్‌కు తరలించి అన్ని మండలాల మట్టిని సేకరించి అనంతరం జిల్లా తరుపున ఒక పెద్ద మట్టి కండను ఢిల్లీకి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, జేఈ రాజనర్సు, టీఏలు లక్ష్మణ్, మనోహర్, సుష్మ, సీవో మధు, కార్యదర్శులు వాణి, లక్ష్మీ, లావణ్య, వెన్నెల, మమత, మౌనిక, నీరజ పాల్గొన్నారు.

గోశాలకు కోడెలు



కోడెలను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన భరత్ గోశాలకు 40 కోడెలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహామూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం



కేటీఆర్‌కు పత్రిక అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి కేటీఆర్‌ను రావాలని పలువురు నాయకులు, గ్రామస్తులు గురువారం ఆయనకు ఆహ్వాన పత్రికను హైద్రాబాద్‌లో అందించారు. ఆదివారం గరుడసేవ, సోమవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదపాఠశాల నిర్వాహకులు వ్యాసోజుల రాధాకృష్ణశర్మ, నాయకులు వెంకట్‌రావు, రాజు, కృష్ణమూర్తి, అంజయ్య, కిష్టయ్య ఉన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

ఎల్లారెడ్డిపేట: సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, వాటిపై అందరికి అవగాహన ఉండాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో గురువారం రాత్రి నిర్వహించిన పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ వారు మాట్లాడారు. సైబర్ మోసాల నుంచి ఎలా బయటపడాలో వివరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు.

తురకకాశి కుటుంబాలను ఆదుకుంటాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల శివారులోని తురకకాశీ కుటుంబాలను ఆదుకుంటామని సిరిసిల్ల అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం 60 మంది పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బండలు కొట్టే బతికే వీరికి కనీసం ఇళ్లను కూడా ప్రభుత్వం నిర్మించి ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో ఆదుకుంటామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెద్దూరులో..

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు బాబాజీ నగర్ కాలనీకి చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సిరిసిల్ల అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, జిల్లా చేనేత అధ్యక్షుడు గోనే ఎల్లప్ప, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తిగా గెలిపించండి

- పార్టీ కార్యాలయం ప్రారంభం..
- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. గ్రామంలోని 50 మంది యువకులు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తిని, ప్రజల సమస్యలను తెలిసిన వ్యక్తిని, నేను లోకల్ బిడ్డను అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ బస రాజశేఖర్, ఎర్రం రాజు, ప్రభాకర్‌రెడ్డి, కత్తి కనుకయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై కాంగ్రెస్ ప్రచారం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, యెల్ల లక్ష్మీనారాయణ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, చేనేత జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్ పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

కోనరావుపేట: మండలం కొండాపూర్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, దరిచేరిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో.

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, చీర్లవంచ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణం, నాంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, బింగి మహేశ్, జోగిని శంకర్, నీలం కల్యాణి, సింగిల్‌విండో చైర్మన్ సల్మాన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో సెల్ఫీ

వేములవాడ: ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పలువురు మహిళలతో సెల్ఫీ దిగారు.

బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పిట్టల భూమేశ్

సిరిసిల్లఅర్బన్: నవంబర్ 1న సిరిసిల్ల కళాశాల మైదానంలో జరిగే బీఎస్పీ బహిరంగా సభను విజయవంతం చేయాలని సిరిసిల్ల నియోజకవర్గ బీఎస్పీ పార్టీ అభ్యర్థి పిట్టల భూమేశ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూస్వాములు, పెట్టుబడి దారులపై సిరిసిల్ల ప్రాంత ప్రజలు పోరాడాన్నారు. మళ్లీ వారికే పట్టం కట్టడం వల్లనే పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగడం లేదన్నారు. సిరిసిల్లలో ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు నిర్మాణం తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీసీలతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమై అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. నవంబర్ 1న జరిగే బీఎస్పీ బహిరంగ సభలో జిల్లాలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, ఎలగందుల వెంకన్న, జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

గంభీరావుపేట: సిరిసిల్లలో నవంబర్ 1న నిర్వహించనున్న సిరిసిల్ల సింహగర్జన సభకు వేలాదిగా తరలిరావాలని బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు కర్రొల్ల రాజు కరపత్రాలు పంపిణీ చేస్తు ప్రచారం చేశారు. మండల కేంద్రంతో పాటు నాగంపేట గ్రామాల్లో మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

అభివృద్ధి చూసి ఓటెయ్యాలి

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి అధికార పార్టీకి ఓటేయాలని కోరారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.సింగిల్‌విండో వైస్‌చైర్మన్ భూంరెడ్డి, సర్పంచ్ భారతి, మహిళా విభాగం నాయకురాలు దొడ్డ శంకరవ్వ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా గద్దె కూల్చివేత

ముస్తాబాద్: మండలం మద్దికుంటలో గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను బుధవారం రాత్రి కూల్చివేశారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ జెండాను కూలివేయడం హేయమైన చర్య అని సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. జెండా గద్దెను పరిశీలించి మాట్లాడారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు దుశ్చర్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన మీసం లక్ష్మణ్, దేవవ్వ అనే ఇద్దరి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల చెక్కులను వారు గురువారం అందజేశారు. మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు



కవాతు చేస్తున్న పోలీస్, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది

తంగళ్లపల్లి: ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు ఓటు వేయడమని, అందువల్ల ప్రతి ఒక్క ఓటరూ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలు, భయభ్రాంతులకు గురవకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం కేంద్రంతో పాటు రామచంద్రాపూర్, పద్మనగర్, జిల్లెల్ల గ్రామాల్లో పోలీస్ శాఖ, స్పెషల్ ఫోర్స్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్, తంగళ్లపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్పాహారం పథకం ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ఎంఈవో దూస రఘుపతి ప్రారంభించారు.

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రారంభించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర ఎంపీ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు.

ముస్తాబాద్: మండలంలో తుర్కపల్లి, గన్నెవారిపల్లె, చీకోడు పాఠశాలల్లో ఎంఈవో బన్నాజీ ప్రారంభించారు.

'దాడి చేసి పంట కోసుకెళ్లారు'

ఎల్లారెడ్డిపేట: తమపై దాడి చేసి దౌర్జన్యంగా తమ భూమిలోని పంటను లాక్కెళ్లారని మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన పంతులుగారి రాజం, ఉప్పులమల్లయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. హరిదాస్‌నగర్ ఉప్పుల రవి, బోనాల మణెవ్వ, బోనాల సాయికుమార్‌కు ఎలాంటి భూమి లేదు. ఫిర్యాదుదారు గురువారం తన పొలంలో వరి పంట కోస్తుండగా అడ్డుకోవడంతోపాటు తమకు వాటా ఉందని దౌర్జన్యంగా పంటను కోసుకెళ్లారు. అంతేకాకుండా చంపుతామని బెదిరించారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పనులు శభాష్

చందుర్తి: మన ఊరు మన బడి మొదటి విడతలో పనులు పూర్తయిన చందుర్తి మండలం జోగాపూర్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ కంట్రోల్ థర్డ్ పార్టీ అధికారి వెంకటేశ్వర్‌రావు గురువారం పరిశీలించి శభాష్ అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల కిషన్‌కు కితాబిచ్చారు. అదనపు తరగతులతో పాటు కిచెన్ షెడ్, మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సామగ్రిని సమకూర్చుకున్న తీరును ప్రశంసించారు.

సన్మానం

సిరిసిల్లటౌన్: ఢిల్లీలో జరిగిన జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభను సమర్థవంతంగా ప్రదర్శించిన విద్యార్థినికి గురువారం సన్మానం చేశారు. సిరిసిల్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సమర్థ అనే విద్యార్థిని ఇన్‌స్పైర్ పోటీల్లో ఎగ్‌షెల్ మోడల్‌ను ప్రదర్శించింది. ఆమెతో పాటు, సహకరించిన ఉపాధ్యాయుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, హెచ్ఎం శారదను సన్మానించి అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

వీర్నపల్లి: రంగంపేట గ్రామానికి చెందిన భూక్య మోహన్(45) గురువారం ఉదయం 7గంటలకు స్నానానికి వెళ్లి బాత్రూంలో గుండెపోటుతో కుప్పకూలారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మోహన్ కంచర్ల గ్రామంలోని ఒడ్డెరకాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేవారు. మృతుడికి భార్య శారద, కొడుకులు చందు, భానుప్రసాద్ ఉన్నారు. సర్పంచ్ లింగం, ఎంపీటీసీ పంబాల రేణుక, మిత్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై కంటతడి పెట్టుకున్నారు.

కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా దుబాల వెంకటేశం, పైసా ఆంజనేయులు, తాటికొండ శ్రీనివాస్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీగా కాసర్ల రాజు, స్వర్గం రాజును నియమించినట్లు పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తెలిపారు.

రుద్రంగిలో పూల సింగిడి







రుద్రంగి: మండల కేంద్రంలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచే తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి సంతోషంగా బతుకమ్మ ఆట ఆడి, పోయిరా బతుకమ్మ పోయి రావమ్మా.. మళ్లోచ్చే ఏడాది మళ్ళీ రావమ్మా అంటూ బతుకమ్మ కుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఎంపీపీ గంగం స్వరూపారాణి, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చెల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఆయన సతీమణి సునీల, కూతురు నిహారిక వేడుకల్లో పాల్గొన్నారు.